


# మేడిపండు కులీనత

కథానిక

"నరుసూ, ఇలారా" అని పిల్చాడు వెంకటలింగం-చీరలు లెక్కపెట్టి మూట కట్టుకుంటూ. "వస్తున్నా" అంటూ వయ్యారంగా సావిట్లోకి వచ్చింది నరసమ్మ. "ఏం వంటయిందా లేదా? నేను అరగంటలో బయలుదేరకపోతే రైలు దాటిపోతుంది" అన్నాడు చీరలు ఇంకా సర్దుతూనే. జరీ మామిడిపిందె అంచు గులాబీచీర పైకి తీసి ఒక్కక్షణం దానికేసి చూసి తిరిగి చీరల మధ్య సర్దేశాడు. నరసమ్మ ఆ చీరవైపే ఆపేక్షతో చూస్తూ ఉండటంవల్ల భర్త అడిగిన ప్రశ్న ఆమెకు వినబడలేదు. మాట్లాడదేమా అని అతడు తలెత్తి చూశాడు. నరసమ్మ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టుంది.

"ఏమిటాలోచిస్తున్నావు నరుసూ?" అన్నాడు.

"ఏమీలేదుగాని ఆ గులాబీచీర ఎంత బాగుందనుకున్నారు!"

"అవును; అదే నేనూ అనుకుంటున్నాను."

"ఏమని?"

"ఈచీర ఇప్పుడు నీకియ్యగలిగితే ఎంత బాగుంటుందని."

"నిజంగా మీకు ఇయ్యాలనుంటే ఎందుకు ఇయ్యరూ?"

"ఈ చీరలన్నీ అమ్ముకుని వచ్చిన తరవాత నీకిల్లాంటి చీర తప్పకుండా నేసియిస్తానుగా."

"ఆఁ, నాకిప్పుడే కావాలి!" అంది నరసమ్మ గోముగా.

వెంకటలింగం కాస్సేపు మౌనంగా అలాగే ఉండిపోయాడు.

నరసమ్మ కాపురానికి వచ్చి ఎనిమిది సంవత్సరాలు దాటింది. ఇన్నాళ్ళకు ఆమె గర్భవతిగా ఉంది. తలిదండ్రులకు ఒక్కతే కూతురు. ముద్దుగా పెరిగిన బిడ్డ. ఆమె కాపురానికి వచ్చిన రెండు సంవత్సరాలకే తల్లి చనిపోయింది. ఒక్కతే కుమార్తె అవడంవల్ల, రామయ్య భార్య పోయినప్పటినుంచీ కూతురు దగ్గరే ఉంటున్నాడు. వాళ్ళకియ్యడానికి తన దగ్గరేమీ ఆస్తి లేకపోవడము చేత తన కాయకష్టంతోనే అల్లుడికి చేదోడుగా ఉండి రోజులు గడుపుతున్నాడతను. నరసమ్మ కాపురానికి వచ్చినది మొదలు చనువుతీసుకుని భర్తను ఎప్పుడూ ఏమీ అడగలేదు. ఇప్పుడు ఆమె నిండు చూలాలుగా ఒక్క కోరిక కోరింది. ఆ ఒక్క కోరికా తను తీర్చలేకపోతున్నాడు. "ఛా, నేనెంత నిర్భాగ్యుణ్ణి!" అని తనను తాను నిందించుకున్నాడు వెంకటలింగం.

"చూడు నరుసూ, ముప్ఫయి చీరలు తీసికెడుతున్నాను. చీరకు మూడు రూపాయలకన్న ఎక్కువ లాభం వస్తుందని తోచదు. అదే మనకు మిగిలేది. చీరల సొమ్మంతా తిరిగి రాగానే నూలు పెట్టుబడిదారునకియ్యకపోతే మన వ్యాపారానికే మోసం వస్తుంది. ముప్ఫయి చీరలు అమ్మాలంటే అధమం వారంరోజులయినా నేను పట్టణంలో ఉండాలికదా! రాకపోకలు, నా భోజనం ఖర్చులు పోగా ఏ డెబ్భయి రూపాయలో మిగిలితే గొప్ప

రాజేశ్వరీ యం. వి. కృష్ణరావు

మాట. నిన్న లేడీ డాక్టరుచేత నిన్ను పరీక్ష చేయించినందుకు అయిదురూపాయలిచ్చుకోవలసి వచ్చింది. ఆ అయిదూ మా తమ్ముడు దగ్గర బదులు తీసుకున్నాను, ఇప్పుడు ఈ ప్రయాణానికి మరోచోట తంటాలు పడి పదిరూపాయలు బదులు తెచ్చాను. ఆడాక్టరమ్మ పదిహేనురోజుల దాకా పురుడురాదని చెప్పింది కనుక ధైర్యంగా బయలుదేరుతున్నాను. ఆ పెట్టుబడి ఆసామీని యాభై రూపాయిలు బదులడగండే ఈ పురుడూ పుణ్యం ఎల్లా వెడుతుంది? ఈ చీర ఖరీదు ఇరవై అయిదురూపాయిలు. దీనిమీద అయిదు రూపాయిలు లాభంతీయగలిగానంటే గొప్పమాట..." ఈ ధోరణిలో వెడుతోంది వెంకటలింగం ఉపన్యాసం. అతడు హఠాత్తుగా తలెత్తి చూశాడు. ఆమె కన్నులవెంట నీరు కారుతోంది.

"పిచ్చిపిల్లా ఇంతమాత్రానికేనా ఏడవడం? పోనీ ఇదుగో తీసుకో చీర. అప్పులో అప్పు మరో పాతిక అప్పుచేద్దాం."

"అయ్యో, అదేమిటండీ అలా అంటారూ? ఆ చీరకోసమటండీ నే నేడుస్తూంటా? మీరు నానా శ్రమలూపడి నాలుగురాళ్ళు తేవడానికి తంటాలు పడుతున్నారు. అది సరేకాని మీరు వచ్చేలోపున పురుడు వస్తుందేమోనని భయమేస్తోందండీ" అంది నరసమ్మ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

"భయమెందుకే వెర్రిపిల్లా, మీనాన్న ఇంట్లో ఉండనే ఉన్నాడుగా. ఇంతకూ డాక్టరమ్మ చెప్పిందాయె పదిహేను రోజులదాకా పురుడు రాదని. దానికేంగాని ఈ చీర అమ్మడానికి నా మనసొప్పడంలేదు; తీసుకుందూ నామాట వినీ!"

"మీకు పుణ్యముంటుంది అది కూడా అమ్ముకుని రండి. ఏదో మాటవరసకడిగాను. దానికింత బ్రహ్మాండం చేస్తున్నారేమిటి? అయినా అన్ని ఖర్చులు ముందుపెట్టుకుని—"అని ఇంకా ఏమో అనబోయింది నరసమ్మ. "ముఖ్యంగా పాపాయి ఖర్చులు ఎన్నో ఉన్నాయికదూ?" అన్నాడు వెంకటలింగం చిరునవ్వుతో నరసమ్మ ముఖంలోకి చూస్తూ. నరసమ్మ సిగ్గుతో తలవంచుకుంది.

చీరలన్నీ సర్ది మూట కట్టడం అయిపోయింది. నరసమ్మ భర్తకి అన్నము వడ్డించి యెదురుగా నుంచుంది. నరసమ్మది ఆకర్షణీయమైన విగ్రహం. గర్భవతి అయాక ఆమెకు క్రొత్త అందం వచ్చింది. ఆమె కట్టుకున్న పాత చీరవైపు చూచి వెంకటలింగం బాధపడ్డాడు. ఆ గులాబీ చీరె కాదు, ఆ మూటలో ఉన్న అయిదారు అందమైన చీరలు తానామెకియ్యగలిగితే ఆమె ఎంత సంబరపడుతుంది! ఆమె బట్టల కరువు తీరిపోతుంది. కాని తనకంత శక్తి ఎక్కడేడిసింది! అడిగిన ఒక్క చీరకే గతిలేదు. హడావుడిగా నాలుగు మెతుకులు నోట్లో వేసుకొన్నాడు. ఇంతట్లో దుకాణానికి వెళ్ళిన మామగారు ఇంటికి వచ్చాడు. "మీ పిల్ల జాగ్రత్తండోయ్. నేను వారం రోజులలో వస్తాను" అంటూ మూటపుచ్చుకని స్టేషనుకి బయలుదేరాడు. "మా అమ్మాయిని నేను జాగ్రత్తగా చూడాలిట" అని నవ్వుకున్నాడు రామయ్య.

* * *

పట్నం చేరుకున్నాడు వెంకటలింగం. దగ్గర బంధువు లొకరుంటే వాళ్ళింట్లో బసచేశాడు. హోటల్లో భోజనం. నాలుగురోజులు మూట పట్టుకుని ఊరమ్మట తిరిగాడు. అప్పుడే పదహారు చీరలు అమ్ముడయాయి. "ఫరవాలేదు ఇంక నాలుగు రోజులలో ఇల్లు చేరుకోవచ్చు" అని తృప్తిపడ్డాడు. అయిదో రోజున యథాప్రకారంగా మూట పుచ్చుకుని బయలుదేరి ఒక కొత్త వీథికి వెళ్ళాడు. "చీరలూ, జరీచీరలూ, రంగు చీరలూ" అని కేకలు వేస్తున్నాడు. ఆ వీథికి మధ్యగా ఉంది రంగమ్మగారి యిల్లు. ఆమె సాధారణంగా వీధిగుమ్మంలోనే నిలబడి ఉంటుంది. అమ్మకానికి వచ్చిన ప్రతి వస్తువునూ కొన్నా కొనకపోయినా పిలవడం ఆమెకి సరదా. ముఖ్యంగా బట్టలవాళ్లు ఆమె గుమ్మం యెక్కకుండా ఆ వీధి దాటివెళ్లడం జరుగదు. పెనిమిటి వదిలిన ఆడపడుచు శేషమ్మ తన యింట్లో ఉండటం ఆమె అదృష్టం. తన కింక వంట బాధగాని పిల్లల గొడవగాని లేదు. అంతా శేషమ్మ చూసుకోవలసిందే. అక్కడికీ ఆమె తేరగా యింట్లో తింటోందనో దూబరా చేస్తోందనో ఏదో ఒక వంకపెట్టి రంగమ్మ శేషమ్మని సాధించిపోస్తూనే ఉంటుంది. గత్యంతరంలేక అన్నీ సహించుకుని

కాలం గడుపుతుంటోంది శేషమ్మ. ఆ రోజు వెంకటలింగం రంగమ్మ పాలబడ్డాడు.

రంగమ్మ చీరలు పరీక్ష చేసింది. ఒకొక్కక్క దాని ఖరీదెంతని ప్రశ్నించింది. అతను చెప్పిన దానికి అయిదురూపాయలు తక్కువకు అడిగింది. అతను గిట్టదన్నాడు. చివరకు ఆమె కళ్లు గులాబీ చీరమీద పడ్డాయి.

"ఈ చీరెంత?"

"ముప్పైరెండు రూపాయలు."

"అబ్బ, అంతాశటోయ్. పాతిక రూపాయిలకు ఇంతకన్న వెడల్పు జరీ అంచులుగల చీరలు వస్తున్నాయి."

"దానికేంతే అమ్మా, దేని ధర దానిది. పోనీ మీ రడుగుతున్నారు గనుక ముప్పై రూపాయిలకు తీసుకోండి."

"పాతిక రూపాయలకి ఒక్క దమ్మిడీ తక్కువియ్యను."

"పోనీలే తల్లీ మీకు దయలేదు" అంటూ బట్టలు సర్దడం మొదలుపెట్టాడు. "అయితే ఇవ్వవన్నమాట" అంది రంగమ్మ నిస్పృహతో.

"ఏదో తల్లీ, నాకూ భోజనంవేళయింది. మీరంత మోజుపడుతున్నారు కనుక ఇరువది ఎనిమిది రూపాయి లిచ్చి తీసుకోండి" అన్నాడు.

"నే నింతకన్నా మంచి చీరలు ఎంత చవగ్గా కొన్నానో చూడు చూపిస్తాను"అంటూ రంగమ్మ గదిలోకి వెళ్ళి పెట్టె తెరచింది. గడచిన రెండు మూడు మాసములలోను భర్తను వేధించి డబ్బు తీసుకుని కొన్న నాలుగయిదు చీరలు చూసుకుని ఒక్కసారి ఉప్పొంగి పోయింది. ఆ చీరలవాళ్లని తానెంత ముప్పతిప్పలుపెట్టి తక్కువ ధరకు వాటిని కొన్నదో తలుచుకుని మురిసిపోయింది. ఆ చీరలన్నీ తెచ్చి వెంకటలింగం ముందు వేసింది. "చూడు ఈ బచ్చలపండు చీర ఎంత బాగుందో! నమ్మతావో నమ్మవో కాని ఇది నేను పదమూడు రూపాయలకే కొన్నాను. ఇదుగో ఈ గళ్లచీర చూడు. ఇది పధ్నాలుగు రూపాయలే. ఈ గుంటూరు జరీచీరుంది చూశావూ, ఇది పద్దెనిమిది రూపాయలకే కొన్నాను సుమా! ఏదీ, నీ గులాబీ చీర? దానిముందు ఎంత వెలవెల బోతూందో చూడు..." ఈ విధంగా ఏకరువు పెడుతూ తన చీరలూ, అతని చీరలూ, కలిపేసి తిరిగి ఏరి పక్కనిపెట్టి"పోనీ ఆ నీలంచీర పదిహేను రూపాయిల కిస్తావా?" అంది. "గిట్టదు తల్లీ, ఇందులో నాకే ఒక్క పైసా మిగిలినా అమ్మకోడానికేగా తిరిగేది. అయినా అమ్మగారికి నామీద దయలేక పోయింది. లేకపోతే ఏదో ఒక చీర బేరంకుదిర్చి పుచ్చుకోరూ, ఇంతకూ నా దురదృష్టం" అంటూ వెంకటలింగం చీరలు మూటకట్టుకుని నెత్తిన పెట్టుకుని గుమ్మందాటి రోడ్డున పడ్డాడు. ఒంటిగంట దగ్గర కావస్తోంది. అతనికి ఆకలి వేస్తోంది. ఇంటిముఖం పట్టాడు. నాలుగడుగులు వేశాడో లేదో మరొక అమ్మ "ఏయ్ చీరలబ్బాయిలారా" అంది. కడుపులో ఆకలి దహించుకుపోతున్నా వెంకటలింగం ఆశ విడవలేకపోయాడు. పోనీ ఈ తల్లైనా ఒక చీర కొంటుందేమో అనుకుంటూ లోపలికి వెళ్ళి మూట విప్పాడు. చీరలన్నీ ఒక్కసారి కలయజూసుకున్నాడు. అతని గుండె గుభేలుమంది. మూటలో గులాబీచీర లేదు. "ఎంతపని జరిగింది? ఆ పక్కింటమ్మ తన చీరలు తీసుకోవడంలో ఇది కూడా వానిలో కలిసిపోయి ఉంటుంది. ఏదో లోకధర్మంచేత అంత బేరం చేసిందికాని అయినింటితల్లి ఆ తల్లి కెందుకు నాలాంటి దరిద్రుడి చీరగుడ్డ"అని గొణుక్కుంటూ "ఇప్పుడే వస్తానుండమ్మా" అంటూ మళ్ళీ మూట నెత్తినేసుకుని ఒక్క పరుగున రంగమ్మగారింటికి వెళ్ళాడు వెంకటలింగం.

వెంకటలింగం గుమ్మందిగగానే రంగమ్మ బ్రహ్మానందంతో చీరలన్నీ తీసుకువెళ్ళి పెట్టిలో జాగ్రత్తగా దాచింది. పెట్టెలోంచి ఆమె తీసినవి అయిదు చీరలేకాని తిరిగి పెట్టెలో పెట్టినవి ఆరు. కానీఖర్చులేకుండా బంగారంలాంటి చీర ఆ రోజు తను సంపాదించింది. ఎంత ప్రయోజకురాలు తను! ఇరుగు పొరుగు ఆడవాళ్ళని పుర్రా స్నెట్టినా తనతెలివి వాళ్ళకివస్తుందా? సంతోషం పట్టలేకుండా ఉంది రంగమ్మ. ఈ నాటకమంతా వంటింటిగుమ్మంలో నుంచుని చూస్తున్న శేషమ్మ "హర హర! ఎంతపాపం కళ్లచూడవలసివచ్చింది" అనుకుంటూ లోపలికి పోయింది. రంగమ్మగారి పిల్లల్ని ఎత్తుకునే గంగి మరీ చిన్నపిల్ల కాదు. పదిహేనేళ్ళొచ్చిన పిల్లవడం మూలాన్ని సంగతి

నంతా కృటిలో గ్రహించింది. అయినా వాళ్ళమ్మగారి మహాత్మ్యము ఆ పిల్లకి తెలియకుండా ఎల్లా ఉంటుంది? అది ఊరుకోక "అంతా గ్రహించావా నందమ్మగారూ, ఇదేం అన్యాయం?" అన్నట్టు ప్రశ్నార్థకంగా చూసింది రంగమ్మవైపు. కాని గంగి నోరుమూయించడ మేమంతకష్టం? చీరలు పెట్టెలో పెట్టి ఆ చేత్తోనే రూపాయి తెచ్చి గంగి చేతులో పెట్టి "నోరెత్తకుస్మా, కొంపమునిగి పోతుంది" అంది. గంగిమనస్సు ఒక్కసారి చివుక్కుమంది. కాని రూపాయిప్రభావంవల్ల కాకపోయినా రంగమ్మగారికి భయపడి ఏమీ ఎరగని దానికిమల్లే ఊరుకుంది.

వెంకటలింగం వగర్చుకుంటూ రంగమ్మగారి గుమ్మంలోకి వెళ్ళాడు. ఆమె గుమ్మంలోనే నిలబడి ఉంది. "నా గులాబీరంగుచీర పొరపాటున మీ చీరలలో కలిసిపోయిందేమో చూడండితల్లీ. మీ యింట్లో మూటవిప్పేసరికి ఆ చీరను మీరుచూసి బేరంకూడా చేశారుకదా! సత్యప్రమాణికంగా చెబుతున్నాను. ఇంతలోకే అది మాయమై పోయింది. నాలాంటి దరిద్రుడిసొమ్ము మీకెందుకు తల్లీ. ఒక్కసారి చూడండమ్మా, మీపాదాలకు మ్రొక్కుతాను" అంటూ కళ్ళనీళ్ళతో ప్రాధేయ పడడం మొదలు పెట్టాడు. రంగమ్మ ఉరిమి చూసింది అతనివైపు. "ఔరౌరా, ఏమంటు న్నావూ? నీచీర నా చీరలలో కలిసిందా? ఎవరేనా వింటే నవ్వుతారు. నీకు కళ్ళులేకపోతే నాకూ లేవనుకుంటున్నావా? చాలుచాలు, ఎక్కడ పారేసుకున్నావో వెళ్ళి వెతుక్కో ఇక్కడ అధిక ప్రసంగం చెయ్యక." అని గర్జించింది. "అయ్యో కన్నతల్లీ, చచ్చి నీకడుపున పుడతాడు ఒక్కసారి చూడమ్మా, చూశాక లేకపోతే నా ఖర్మమనుకొని నెత్తిన గుడ్డేసుకుని పోతాను. నీకు పుణ్యముంటుంది ఒక్కసారి చూడుతల్లీ" అని కాళ్ళావేళ్ళా పడ్డాడు.

"ఏమిటి నీపొగరూ? నేనెవరనుకుంటున్నావు? నీకుకాదూ చెపుతూంటు? ఇది పోలీసు ఇనస్పెక్టరు గారి ఇల్లని నీకింకా తెలియలేదేమో. ఇక్కడ దొంగతనాలు కడదామనుకుంటున్నావా? ఏయ్ జవాన్! ఇతను మర్యాదగా ఇక్కడనుంచి వెడతాడో పోలీసుస్టేషను చూడ్డానికి ముచ్చటపడుతున్నాడో కనుక్కో" అంటూ చరచరా లోపలికి వెళ్ళిపోయింది. "అయ్యో ఖర్మమా? పోలీసులు కూడా ఎందుకుతల్లీ, ఇదిగో పోతున్నా" అనుకుంటూ కాలేకడుపుతో మండుటెండలో మూట నెత్తినేసుకుని కాళ్ళీడ్చుకుంటూ బసచేరుకున్నాడు వెంకటలింగం.

మరునాటి ఉదయం రంగమ్మ మంచంమీది నుంచి లేవకుండానే గంగి పనిలోకి వచ్చింది. శేషమ్మ పెరట్లో గంగినిచూచి "ఏమే గంగీ చూసికూడా ఊరుకున్నావు?" అంది. "నామాట కేంగానండి. మీరుకూడా ఊరుకున్నారే?" అంది గంగి. "అయ్యో ఊరుకోకేంచెయ్యమంటావే. నాకే రంగమ్మనెదిరించేశక్తి ఉంటే పక్కింట్లోంచి ఆవిడా ఆవిడపిల్లలూ దొంగిలించుకువచ్చిన జోళ్ళూ, పెన్నులూ, బంతులూ మొదలైనవెన్నో పెట్లోపెడుతూంటే చూస్తూ వూరుకుంటానా? నాకు గత్యంతరంలేదు. రంగమ్మ మా అన్నగారి ఇంటికి ఎప్పుడైతే దాపురించిందో అప్పటినుంచీ ఈ యింట్లో పాపపుణ్యముల విచక్షత నశించింది." అంది. కాని గంగికేమి? దానికి రంగమ్మగారు బీదలకడుపుకొట్టి చేసే ఘోరకృత్యాలు చూడ్డం ఇష్టంలేకపోతే ఇంకోయింటికిపోయి చాకిరీచేసు కుంటుంది. ఈ దుర్మార్గురాలిపంచని ఇక ఒక్కమైనా ఉండకూడదు అనుకుంది గంగి. రంగమ్మ లేచి పెరట్లోకి వచ్చేవరికి శేషమ్మా గంగీ ఏదో నెమ్మదిగా మాట్లాడుకుంటున్నట్లు గ్రహించింది. గంగిని పనిలో ఉంచుకోడం ఏమైనా మంచిది కాదని తోచింది రంగమ్మకి. "ఏమే గంగీ ఇంత ఆలస్యంగా వచ్చావూ?" అంది రంగమ్మ. "ఆలస్య మెక్కడమ్మా, మీరూ చంటిబాబుగారూకూడా లేవకుండానే వచ్చానుగా!" అంది.

"ఏమో నీవరస నాకేం నచ్చలేదు. నువ్వు రేపటినుంచి పనిలోకి రానక్కర్లేదు."

"నేనూ ఆ మాటే చెబుదామనుకుంటున్నానండి. నాకేమొస్తుందో పారెయ్యండి మరో యిల్లు చూసుకుంటాను."

"ఓహో! అంతవరకూ వచ్చిందీ వ్యవహారం? అయితే ఆమధ్య నేనిచ్చిన పాత పరికిణీ జాకెట్టూ తెచ్చి వప్పజెప్పు. అప్పు డాలోచిస్తాను జీతం సంగతి."

"అల్లాగేనండి" అంటూ గిరుక్కున తిరిగి వెళ్ళి పోయింది గంగి. అప్పుడేలేచి కళ్లునులుపుకుంటూ పెరట్లోకి వస్తున్న ఇనస్పెక్టరుగారు అన్నారు భార్యతో—

"ఇదుగో రోజుకోపిల్లను మానిపిస్తే ఇబ్బంది పడేది నువ్వే. గంగి మంచిపిల్ల మళ్ళీ అల్లాటిపిల్ల దొరకడం ఎంత కష్టం?"

"అబ్బో పనివాళ్ళ మంచితనాన్ని పొగడ డానికి మీ తరవాతే. అయినా ఆ బాధ మీ కెందుకూ? నే నామాత్రం పిల్లని కుదుర్చుకోలే నంటారా? నలుగురు జవానులను నాలుగువీధులకీ పంపానంటే లెక్కలేనంతమంది పిల్లలువచ్చి పడి గాపులడి కూర్చుంటారు నా గుమ్మంలో."

"ఏదో పొరపాటున అన్నానులే. నీవంత సమర్థురాలవని నాకు తెలుసు. అయినా నీ తంటాలు నీవు పడుతుంటే నాకెందుకీగోలంతా?" అంటూ దంతధావనం మొదలెట్టారు ఇనస్పెక్టరుగారు.

ఆరోజు మధ్యాహ్నం పన్నెండుగంటలవేళ పాతపరికిణీ జాకెట్టు మడిచి చంకను పెట్టుకుని గంగి రంగమ్మగారివీధి మలుపు తిరుగుతోంది. సరిగా అదే సమయంలో వెంకటలింగం నిరుత్సాహంతో మూట మోసుకుంటూ ఆ సందులోకే మళ్లుతున్నాడు. గంగి 'మామా' అని మెల్లగా పిలిచింది. వెంకటలింగం వెనక్కి తిరిగిచూశాడు. నిన్న రంగమ్మగారింట్లోఉన్న పిల్ల. తుళ్ళిపడి మళ్ళీ తమాయించుకున్నాడు.

"ఏం పిల్లా?"

"మళ్ళీ ఈ వీధిలోకే వస్తున్నావా?"

"ఏం ఆమె నా చీర నిజంగా దొంగిలించిం దంటావా?"

"సత్తికాలం మామా! నీకింకా సందేహంగా ఉందా?"

"అయితేమాత్రం ఏం చెయ్యనూ, నా ఖర్మం! మిగిలినచీరలు ఏదో ఓకాడికి అమ్ముకుని కొంప జేరుకోవాలిగా!"

"మళ్ళీ ఆమె గుమ్మంమాత్రం ఎక్కకేం!"

"ఇంకానా బాగా బుద్ధివచ్చిందిగా! అయినా ఆ అమ్మగారిదగ్గర పనెల్లా చేస్తున్నావ్ పిల్లా?"

"అందుకే మానేస్తున్నాగా!"

"ఏంచేత?"

"ఆమె చీర దొంగిలించడం నాకు తెలుసునని నేనుండడం ఆమె కిష్టంలేదు. ఆమె చేస్తూన్న పనులకి వళ్లు మండుకొచ్చి నేను మానేస్తున్నాను. ఆవిడ కొన్నాళ్ళక్రితం నాకోపాత పరికిణీ, జాకెట్టూ ఇచ్చిందిలే. ఇవి తిరిగి ఇస్తే నాకు రావల సిన జీతం ఇస్తానంది. అందుకనిపోతున్నాను."

"అయితే ఆ మహాతల్లి ఈ పరికిణీ జాకెట్టు పుచ్చుకుని నీ జీతం నీ కిస్తుందంటావా?"

"పోనీ, ఇయ్యకపోతే మరీ మంచిది. ఆ పాపపు సొమ్మంతా ఆమెదగ్గరే పెరుగుతూ ఉంటుంది. ఆమె ఇచ్చిన ఈపాడు బట్టలుమాత్రం నాదగ్గర ఒక్క క్షణంకూడా ఉంచుకోను... మామా, అన్నట్టు మరిచిపోయాను. ఇదుగో రూపాయి, నిన్న నీ ముప్పైరూపాయిల చీరా కాజేసి అది బయటపెట్టకుండా ఉండడానికి గాను ఈ రూపాయి నాచేతిలో పెట్టింది. పాపం అంత సొమ్ము పోగొట్టుకున్నావు. ఈ ఒక్క రూపాయైనా నువ్వు పుచ్చుకోడం న్యాయం!"

"అంతసొమ్ము పోగా లేనిది ఈ ఒక్కరూపా యికి వచ్చిందా? ఈపరాయిస్థలంలో నువ్వొక్క దానివైనా నిజం గ్రహించి నన్నుచూసి జాలి పడుతున్నావు. అదే చాలు. నీ మాటలవల్ల నా మనోవ్యథ సగం తగ్గింది. అయ్యో, ఇక్కడే ఆగిపోయాను. సాధ్యమైనంత తొందరగా ఈ చీర లమ్మేసుకుని ఇంటికి పోవాలి."

"మాటిమాటికీ ఇంటికిపోవాలని తొందరపడు తున్నావేం మామా, ఇంటిదగ్గర అంతా క్షేమ మేనా"?

"కాని మీ అత్తకి రేపో నేడో పురుడు వస్తుంది."

"ఓహో అల్లాచెప్పు. అయితే ఈ రూపా యితో మా అత్తకి మిఠాయికొని తీసుకువెళ్లు" అంటూ ఆ రూపాయి వెంకటలింగం చేతిలో పడేసి అక్కడ ఉండకుండా తుర్రుమని పారి పోయింది గంగి.

రంగమ్మచేసినదానికో పక్క బాధపడుతూ, గంగి మంచితనానికి ఆశ్చర్యపడుతూ మూట మోసుకుంటూ వీధులవెంట నడిచాడు వెంకట లింగం.

మిగిలిన చీరలు ఏదో ఓధరకి అమ్ముకుని ఎల్లాగయితేనేం యిల్లు చేరుకున్నాడు వెంకటలింగం పన్నెండురోజులకి. గుమ్మంలో అడుగు పెట్టగానే నరసమ్మ ఎదురురాదేమా అని చూస్తూన్న వెంకటలింగానికి చంటిపిల్ల ఏడుపు వినిపించింది గదిలోంచి. మామగారు అల్లుణ్ణిచూసి—

“రావోయ్ వెంకటలింగం, ఖులాసాగా వచ్చావా? వట్టినే వెళ్ళావు, కుమార్తె తండ్రివై వచ్చావు” అన్నాడు చిరునవ్వుతో. వెంకటలింగం పడిన మనోవ్యథ కష్టము-నష్టము అన్నీ ఒక్కసారి మరిచిపోయి ఏదో ఎప్పుడూ ఎరుగని ఆనందంతో భార్యగది గుమ్మందగ్గరకు వెళ్ళి తొంగి చూశాడు. నులకమంచంలో ఉన్న భార్యాబిడ్డలను చూసుకుని ఒక్కక్షణం ప్రపంచమంతా మరిచిపోయాడు. కాని వెంటనే అతనిముఖంలో విచారరేఖ గోచరించింది. నరసమ్మకేమీ అర్థంకాలేదు.

“ఏమండీ, లాభం సరిగా వచ్చిందా?”

“కొంత నష్టమే వచ్చింది.”

“సొమ్ము ఎవరేనా దొంగిలించలేదుకదా!”

“అపనే జరిగింది. ఆ గులాబీ చీరను ఓ అమ్మ దొంగిలించింది.”

“అంత దరిద్రరాలెవరండీ, మన గుడ్డముక్కను దొంగిలించడానికి? మీరూరుకున్నారా మరీ?”

“ఆమె ఒక గొప్పింటి బిడ్డ. ఘరానా మనిషి. పోలీసు ఇనస్పెక్టరుగారి భార్య. ఊరుకోకపోతే ఖైదులో కూర్చోమంటావా?”

నరసమ్మ నిరాశతో కళ్లుమూసుకుంది. ఈ సంభాషణంతా వింటున్న రామయ్య అల్లుణ్ణి దగ్గరగా పిలిచి “చూడు, నిన్న ఉదయం అమ్మాయికి నొప్పులు వచ్చాయి. పురుడు కొంచెం కష్టమయింది, లేడీ డాక్టర్లని పిలవవలసివచ్చింది. ఆమె ఏభై రూపాయలు పుచ్చుకుంది. నీతమ్ముడెక్కడో బదులు తెచ్చి ఆమెకా సొమ్ము ఇచ్చాడు. ఇప్పుడీ ఖర్చులన్నీ ఎల్లా తట్టుకుంటావో ఏమిచేస్తావో నాకేం తోచకుండా ఉంది!”

వెంకటలింగం ఒక్క నిట్టూర్పు విడిచి చేతులలో తల ఆన్చుకు అలాగే ఉండిపోయాడు. నరసమ్మ సంగతంతా వింటూనే ఉంది.

“నాన్నా ఇలా రా, మాట” అని పిలిచింది. రామయ్య కూతురు గదిలోకి వెళ్ళాడు. “ఒక పసుపుకొమ్ము దారం తీసుకురా!” అని మెల్లిగా అంది. రామయ్య వణుకుతున్న చేతులతో పసుపుకొమ్ము దారం తీసుకెళ్ళి కూతురుచేతిలో పెట్టాడు. ఆమె పసుపుకొమ్ము మెడలో కట్టుకుంది. మెడలోని రెండు మంగళసూత్రాలూ తీసింది. అవి రెండూ రెండుకాసులుంటాయి. పెండ్లికి తండ్రి ఒకటీ మామగారు ఒకటీ చేయించారు. అప్పుడు కాసులు చవక. ఆమెకున్న ఆభరణాలు ఆ మంగళసూత్రాలే. “నాన్నా, ఆయన్ని ఇలా రమ్మను” అంది. వెంకటలింగం మెల్లిగా ఆమె గదిలోకి వెళ్ళాడు.

“ఇదుగో, ఇలా చూడండి. ఈ రెండూ రెండు కాసులుంటాయి. కాసులు ప్రియంగా ఉన్నాయి కనక ఈ రెండింటికి అధమం నూటనలభై రూపాయలయినా వస్తుంది. దానితో మన ఇబ్బంది గడిచిపోతుంది. ఆఁ, అదేమిటండీ అలాఉన్నారు? ఇంత చిన్నవిషయానికల్లా బెంగపెట్టుకుంటారా ఎవరేనా? పాపాయినిచూస్తే మీకు సం షంగా లేదూ? పాపాయి మీకు నచ్చలేదా?”

“వెర్రిదానా! పాపాయికేం, బంగారుతల్లి. కాని నీకు చీరలేకుండాచెయ్యడమే కాకుండా ఈ పాపానికికూడా ఒడికట్టుకుంటున్నాను.”

“అవేమిటండీ అలా అంటారూ? పాపాయి బాగుంటే చీరలూ, నగలూ, ఎందుకండీ?”

“నిజమే నరసూ! నీవలా తృప్తిపడితే నాకింక కావలసినదేముంది? నువ్వు నిజంగా నా భాగ్యదేవతవి” అంటూ ఆ మంగళసూత్రాలు కండువా కొంగుకి కట్టుకుని బయలుదేరాడు కన్నీళ్లతో.

